“కాల్చి చంపేశారు”

ఈ జవాబుకి అప్పారావు సైతం అదిరిపడి వెంటనే తేరుకుని గట్టిగా రంకెలు వేశాడు.

“ఎంత దారుణమో చూశారా! కన్నబిడ్డ కళ్ళముందే కాల్చి మరీ చంపితే మన దేశంలో కులవ్యవస్థ ఎంత విలయతాండవం చేస్తున్నదీ మీరు అర్థం చేసుకోవాలని మనవి చేస్తున్నాను. ఆ తర్వాత వీళ్ళ నాన్నగార్ని.....”

“కాదు, అసలు మా నాన్న....” నానీ అసహనంగా మరేదో చెప్పబోతుంటే మరోమారు అడ్డం పడిపోయాడు అప్పారావు.

“అవును. వీళ్ళ నాన్నే అక్కడనుంచి పారిపోయి వుండకపోతే ఆయనకూడా ఆ మంటలకి ఆహుతై పోయేవాడు. అదే పసిబిడ్డ చెప్పబోతున్నది. అలాంటి పైశాచిక చర్యని అడ్డుకునే సాహసం ఎవరికుంటుంది? ఎవరికుంటుందని నేను మనవి చేస్తున్నాను.
కట్టుకున్న భార్య మంటల్లో తగలబడిపోతూంటే.... కన్నబిడ్డ ఆక్రందన మరోపక్క గోపాలాన్ని మతిభ్రష్టుడ్ని చేశాయి.... అలాంటి స్థితిలో.....”

ఆ మాటలు నానీకి వినిపించటం లేదు.

నానీ ఇప్పుడు ఆ మాటల్ని వినే స్థితిలో లేడు. ఆ హాలు వెనుక కిటికీ దగ్గర నిలబడ్డ రాజారావునే గమనిస్తున్నాడు.

“చూడండి.... ఆ స్మృతుల్ని మరచిపోలేక పసిబిడ్డ ఎలా వణికిపోతున్నాడో... ఇలా అయితే రేపటిపౌరులు కావలసిన ఇప్పటి బాలలకు రక్షణ ఎక్కడ?” క్షణ క్షణం మీద పడుతున్న మృత్యువునుంచి ఇక తప్పించుకోలేక, అటు తన తల్లి చావుని మరిచిపోలేక ఒక గాంధీ లేక ఒక నెహ్రూ కావాల్సిన ఓ పసికందు ఇలా అలమటించిపోతున్నాడూ అని మీరంగీకరిస్తే మీ కళ్ళూ నాలాగే చెమర్చక మానవు.

అంటే తమకు మనవి చేసేదేంటంటే ఈ విషయంలో నేను మరింత లోతుగా పోయాక గాని ఈ ప్రాంతాల్ని విడిచిపెట్టనని హామీ ఇస్తూ నా నియోజకవర్గంలో శాంతిభద్రతలు పూర్తిగా నెలకొన్నాకగాని నేనిక్కడ నుంచి కదలనని మరోసారి ఉద్ఘాటిస్తూ యీ వార్తని ప్రజలకి అర్జెంటుగా పత్రికలద్వారా తెలియచెప్పమని కోరుతూ నేను సెలవు తీసుకుంటున్నాను” అమాంతం నానీని పైకెత్తుకున్నాడు.

ఓ క్షణంపాటు కెమెరాలకి కన్వీనియంట్‌గా ఫోజుపెట్టి ఆ తర్వాత నానీని కిందకి దించి ఇంచుమించు గదిలోకి లాక్కుపోయాడు.

పత్రికా విలేఖర్లు అపూర్వసత్యంగా ఇదంతా నమ్మి చకచకా రాసుకుపోతున్నా ఇదంతా ఒక సమర్థింపుగా, అభూతకల్పనగా భావించింది ఒకే ఒక్క విలేఖరి.

అతడు రాందేవ్!

వేడి వార్తల్ని వెలికితీయడంలో, రాజకీయ నాయకుల చీకటి బ్రతుకుల్ని రచ్చకీడ్చడంలో పేరెన్నికగన్న ‘నిజం’ దినపత్రిక చీఫ్ రిపోర్టర్.

వెళుతున్న నానీని పరిశీలనగా చూస్తూ అనుకున్నాడు.... "నిజాన్ని నొక్కిపట్టలేవు మిష్టర్ అప్పారావ్- నువ్వు దాచేసిన వాస్తవాన్ని తవ్వడ మెలాగో నాకు తెలుసు."

** ** ** **

"నాకు తెలీదు" కళ్ళు నీళ్ళ పర్యంతమౌతుంటే భయంతో బిగుసుకుపోతూ అంది సరళ "అసలు నానీమీద నాకు కక్షేమిటి?"

అప్పటికి ఒక గంటనుంచి సరళని, కాంతమ్మని, చంద్రాన్ని ప్రశ్నలతో వేధిస్తున్న యశస్వి నెమ్మదిగా సరళని సమీపించాడు "నీకు తెలీదు. నీ తల్లికి తెలీదు. కాని చాలా అవసరమనిపించే క్షణాల్లో నానీ మాయమైపోయాడు కదూ! పాపం నీకు నానీ మీద ఏ కక్షా లేదు.... కదూ???"

తలూపింది వణికిపోతూనే.

"పోనీ నీ ప్రియుడు రాజారావుకు.... అలా కంగారుపడకు మీ ఆయనకు చెప్పనులే... ఎందుకంటే నీలాంటి ఏ కొద్దిమంది మూలంగానో నేను ఆడజాతినంతా అసహ్యించుకోను కాబట్టి, నేను నిజం కక్కితే నీ కాపురం కూలిపోతుందన్న కొద్దిపాటి సానుభూతి ఇంకా మిగిలేవుంది కాబటి.. చెప్పు... నానీ ఎక్కడ" ఇక నిభాయించుకోలేనట్టు సరళ జుట్టు పట్టుకోవడానికి చేతిని పైకెత్తబోతుండగా చంద్రం అడ్డం పడ్డాడు.

"పరాయి ఆడదానిమీద చేయివేసే హక్కు మీకు లేదు. అసలు..." చంద్రం మాటలింక పూర్తికాకుండానే యశస్వి పిడికిలి అతని పొట్టను తాకింది.

"నువ్వు హక్కుల గురించి మాట్లాడ్తున్నావా స్కౌండ్రల్. నీ జీవిత భాగస్వామి బ్రతికే హక్కు కాలరాసి ఒక బజారు ఆడదాని ప్రోద్బలంతో నీ తల్లీ చెల్లెళ్ళ అండతో భార్యని హత్య చేసిన నువ్వు నా హక్కుని ప్రశ్నిస్తున్నావా...." ఈ సారి చంద్రం కళ్ళు బైర్లు కమ్మేటట్టు గెడ్డంపై గుద్దాడు.

చంద్రం నీరసంగా తూలిపోతుంటే ఆసరా ఇచ్చి "చూడూ.... కట్టుకున్న నేరానికి భార్యని హత్యచేసే హక్కు నీకున్నట్టే నేరం చేసినవాళ్ళను తోలు వలిచేహక్కు పోలీసాఫీసర్‌కే వుంటుంది" అంటూ దూరంగా నెట్టి వేశాడు.

"మిష్టర్ చంద్రం- నువ్వు చేసుకున్న అదృష్టమేమన్నా వుంటే అది పావనిలాంటి ఓ సాధ్వి నీకు భార్య కావడం...

ఇంత చేసినా నిన్నూ నీ వాళ్ళని రక్షించాలని చివరి వూపిరిదాకా ఆ తల్లి ప్రయత్నించి మరీ ప్రాణాలు విడిచింది.

నువ్వు చదువుకున్న పురాణాలే నిజమైతే ఆమె ఉసురు ఆ శాపం మీ అందర్నీ ఎలాగూ కాటేస్తుంది. మళ్ళీ నానీని ఎందుకు దాచేశారు- ఒక నిజం చెప్పించాలనుకున్నాననేగా- అందుకే నానీని కడతేర్చే ప్రయత్నం చేస్తే నాకు మీరు వ్యక్తిగతమైన శత్రువులై పోతారు" ఉద్వేగంగా చంద్రం కాలరు పట్టుకున్నాడు "రేయ్- ఐ వాంట్ నానీ- ఐ ఇమ్మీడియేట్లీ వాంట్ హిమ్ సేఫ్- లేదూ మిమ్మల్ని వెంటాడి వేధించి మరీ ఉరికంబ మెక్కిస్తాను. నానీని సురక్షితంగా ఇరవై

నాలుగు గంటల్లో నా ముందుంచాలి. అర్థమైందా" వదిలేశాడు- "కౌంట్ డౌన్ మొదలైంది లెక్కపెట్టుకో."

ఆవేశంగా బయటకు నడిచాడు.

బుల్లెట్ స్టార్ట్ చేయలేదు. సరాసరి రాజారావు దగ్గరికి వెళ్ళాడు. ఇంటివాళ్ళు చెప్పారు మూడు రోజులుగా అతడు ఇంటికే రావడం లేదని.

యశస్వి భ్రుకుటి ముడిపడింది.

మరో అయిదు నిముషాలలో బుల్లెట్ కామేశ్వరి ఇంటిని చేరుకుంది.

ఆ ఇల్లు తాళం వేసివుంది.

నానీ మిస్ కావడంలో మిగతా పాత్రల పాత్ర ఎంతుందీ అని ఆలోచించాడు.

రాత్రి పొద్దుపోయాక నానీ కోసం మరో చిన్న ఆధారమైనా దొరుకుతుందేమోనని తెగ ప్రయత్నించి చివరిగా కామేశ్వరి ఇంటికి వచ్చాడు.

ఇంకా తాళం వేసే వుంది.

అసహనంగా అనకాపల్లిలో అతనుండే ఎపార్ట్మెంట్కి వచ్చాడు.

అప్పటికే బయట ఫియెట్ లో వెయిట్ చేస్తోంది హరిత.

నిశ్శబ్దంగా అతడ్ని అనుసరించింది.

"ఏమైంది" అలసటగా గదిలోని సోఫాలో వెనక్కివాలి కూర్చున్న యశస్విని లాలనగా అడిగిందామే.

మోచేతిని తలపై వుంచుకొని సీలింగ్వేపు చూస్తూ వుండిపోయాడు. చాలాసేపటిదాకా "హరితా.... అసలు నానీ బ్రతికే వున్నాడంటావా?"

* * * * *

"అమ్మా...."

గెస్ట్హౌస్లోని ఓ మారుమూల గదిలో నేలపై పడుకుని వున్న నానీ కళ్ళనుంచి ఇక ఆగలేమమ్మా అంటూ నీళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి.

భయంగా వుంది. దిగులుగా వుంది అంతకుమించి చుట్టూ వున్న అపరాత్రి చీకటి అమ్మని మరీ మరీ గుర్తు చేస్తుంది.

"ఆకలేస్తుందమ్మా.... రెండుసార్లు ఆకలిపాట పాడాక .... ఇకా ఆకలేస్తూనే వుందే... నన్ను చీకట్లో దాచేశారే... అమ్మ నాకు భయ్యమేస్తుందే...." వెక్కిపడుతున్నాడు. "ఇలాంటప్పుడు ఏం చెప్పలేదేంటమ్మా!"

ఓ పక్కకి ఒత్తిగిలి వణికిపోతూ రెండు చేతుల్ని చెంపల కిందుంచుకుని నిస్త్రాణగా కళ్లను అరమోడ్పుల్ని చేస్తుంటే.....

లీలగా తల్లి రూపం కనిపించింది.

ఎక్కడ్నుంచి వచ్చిందో "మంచి నానీలు ఏడుస్తారా.... ముద్దులా కన్నాలు

కన్నీళ్ళెట్టుకుంటారా" అమ్మ చెంపల్ని స్పృశిస్తూంది. పాపిడి సర్దుతూంది.

నెమ్మదిగా గోడని చేరుకుని స్విచ్ కోసం తడుముతూ టక్కున ఆగిపోయాడు.

పక్కగదిలో నుంచి ఏవో మాటలు వినిపిస్తున్నాయి నెమ్మదిగా.

ఉత్సుకతను ఆపుకోలేక కిటికి రెక్కని వారగా తెరిచి ఆక్కడి దృశ్యాన్ని చూసి ఉలిక్కి పడ్డాడు.

ఒంటిమీద బట్టలు లేకుండా అప్పారావు మరో స్త్రీని పెనవేసుకుని బెడ్‌పై దొర్లుతున్నాడు.

అదేంటో తెలీదు.

కాని జుగుప్సగా అనిపించడంతో వెనక్కి జరిగాడు.

ఇప్పుడు మాటలు మరింత స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"నీ దుంపతెగ- ఏం దంపుడు- ఇన్నిసార్లు పరుపెక్కాను గాని ఇంత బలం వున్న ఆడదాన్ని చూడటం ఇదే మొదటిసారి-" ఆపసోపాలు పడుతూ మూలుగుతున్నాడు హోంమినిష్టర్ ఆకుల అప్పారావు.

"ఇంకా ఏం చూసావు అప్పడూ! ముసలితనం రొప్పులతో మూలపడతావని భయపడుతున్నానుగాని ఒళ్ళు మండితే ఉపన్యాసం మొదలెట్టేస్తాను."

"ఉపన్యాసమేమిటీ?" అప్పారావు అనుమానం నివృత్తి చేసేట్టు అమాంతం అతడిపైకి చేరింది.

"ఇలా వేదికనలంకరించడం."

"అమ్మనీయమ్మ. ఆడదానివంటే నువ్వేనే. ఇంకా.... ఏం చేస్తావు" అప్పారావు కళ్ళలో తొలిసారి మంత్రి పదవిని చేపట్టిన తాదాత్మ్యత.

"ఆ తర్వాత అసెంబ్లీలోకి అడుగుబెడతాను."

"ప్రతిపక్షాల గోలని ఇలా అణచివేస్తాను."

"హమ్మో.... మొత్తం..."

"కొట్టిన పిండే..." రొప్పుతూ అంది.

"నువ్వు నా గురించి ఆలోచించాలేగాని పోటెక్కిన సముద్రంలా నీ మీద పొర్లిపోతాను."

"కాముడూ....." ఆ తరువాత యిక మాట్లాడలేకపోయాడు అప్పారావు.

లయబద్ధంగా వినబడుతున్న బెడ్ చప్పుడులో తనకు కామేశ్వరిని కానుకగా పంపిన విశాఖ జిల్లాపరిషత్ చైర్మన్ రంగరాజుని మనసులోనే అభినందిస్తున్నాడు.